
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 8 మే 2024



ప్రధానిపైనే ఆశలు - నేడు వేములవాడలో మోదీ పర్యటన 8

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం 8

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

సిరిసిల్ల కలెక్టరేట్, మే 7: జిల్లాలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరపై కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడవద్దని కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 20 వేల 761 మంది రైతుల నుంచి లక్షా 41 వేల 390 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరపై కొనుగోలు చేశామని పేర్కొన్నారు. రైతులకు రూ.200 కోట్ల పైగా చెల్లింపులు బ్యాంకు ఖాతాలో జమ చేశామని తెలిపారు. ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వానికి నివేదించి మద్దతు ధరపై కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 7: లోక్ సభ ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ లక్ష్మీ రాజం ప్రకటనలో సూచించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి వేములవాడలోని నూతన లైబ్రరీ భవనం, సిరిసిల్ల గీతా నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. బుధవారం ఆఖరి రోజని తెలిపారు.

10 నుంచి మార్షల్ ఆర్ట్స్ వేసవి శిబిరం

సిరిసిల్ల టౌన్, మే 7: సిరిసిల్ల కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి జూన్ 10 వరకు వేదశ్రీ స్మారకార్థం బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత వేసవి శిబిరం ప్రారంభించనున్నట్లు మంగళవారం అకాడమీ మాస్టర్ ఓరగంటి రామకృష్ణ తెలిపారు. ప్రతీ రోజు సాయంత్రం సిరిసిల్ల పట్టణం కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాలికలకు ఉచితంగా మార్షల్ ఆర్ట్స్‌తోపాటు కర్రసాము, నాన్ చాక్, యోగా వంటి పలు క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు సెల్ : 9676077160 నంబరులో సంప్రదించాలని సూచించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు

చందుర్తి, మే 7: చందుర్తి మండల కేంద్రంలోని సాయి బాబా ఆలయ 33వ వార్షికోత్సవాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకున్నారు. జడ్పీటీసీ నాగం కుమార్, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు సిరికొండ శ్రీనివాస్, భాశెట్టి భాస్కర్, మేడిశెట్టి రాజు, భైరగోని రమేష్, ఆలయ చైర్మన్ పోతరాజు రవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోదీ సభకు స్వచ్ఛందంగా తరలిరండి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



వేములవాడ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బండి సంజయ్

వేములవాడ, మే 7: ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభకు స్వచ్ఛందంగా తరలిరావాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. ప్రధాని మోదీ వేములవాడ బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం రాత్రి స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం నిర్వహించే 'ఎములాడ జన సభ'ను దిగ్విజయం చేయాలని కోరారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలు ఎండ వేడిమిని, వానలను తట్టుకునేలా అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడకు రావాలని తాము చేసిన విజ్ఞప్తి మేరకు నరేంద్రమోదీ వేములవాడకు వస్తున్నారని, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తరలివచ్చి మోదీ సభను విజయవంతం చేయాలని కోరారు. బుధవారం ఉదయం 8 గంటలకు ప్రధాని మోదీ వేములవాడ రాజ రాజేశ్వరస్వామివారి ఆలయాన్ని సందర్శిస్తారని, అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీకి ఎక్స్‌పైరీ డేట్ వచ్చింది

భగత్‌నగర్: అవినీతి, కుంభకోణాలు వారసత్వ పాలనతో దేశాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్‌కు ఎక్స్పైరీ డేట్ వచ్చేసిందని బీజేపీ జాతీయప్రధాన కార్యదర్శి కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడారు. తన ఆస్తిపాస్తులపై సీబీఐ విచారణ కోరేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, మీ ఆస్తి, అవినీతి, బినామీ ఆస్తులపై విచారణకు సిద్ధంగా ఉన్నారా అంటూ సవాల్ విసిరారు. తాను సీబీఐకి లేఖ రాసేందుకు సిద్ధంగా ఉన్నానని, తన సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పెద్ద డ్రామా ఆర్టిస్టు అని, సీబీఐని రాష్ట్రంలోకి అడుగుపెట్టకుండా ఉత్తర్వులు ఇచ్చిన కేసీఆర్ తాను సుద్దపూసనని, మోదీ అరెస్టు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని చెబుతున్నారన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందన్నారు. దీనిపై ప్రశ్నిస్తే నరేంద్రమోదీపై ఆరోపణలు చేస్తూ చర్చను పక్కదారి పట్టిస్తోందని విమర్శించారు. కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ అని, మచ్చలేని మోదీ 140 కోట్ల మందికి గ్యారెంటీ అన్నారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ కాస్తా రెండు రాష్ట్రాలకే పరిమితమైందన్నారు. చివరకు ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోయిందన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ నేతలు డబ్బులు అడ్డగోలుగా ఖర్చు పెడుతూ గెలవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా పోటీలోఉన్న అభ్యర్థులను బేరీజు వేసుకుని ఓటు వేయాలన్నారు.

● మోదీ సభను విజయవంతం చేయాలి

వేములవాడలో బుధవారం నిర్వహించనున్న మోదీ సభను విజయవంతం చేయాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఉదయం 8 గంటలకు ప్రధాని వేములవాడకు చేరుకుని రాజన్నను దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారన్నారు.

● బీజేపీలోకి ఇద్దరు కార్పొరేటర్లు

బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు వంగల శ్రీదేవి పవన్, కొలిపాక అంజయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎడ్ల శ్రీనివాస్, 47వ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఆపపెల్లి మాజీ సర్పంచు కాశెట్టి రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పదం రాజు, మాండల అధ్యక్షుడు శివరాజు బీజేపీలో చేరారు.

ఇల్లంతకుంట : వేములవాడలో బుధవారం నిర్వహించనున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విజయ సంకల్పసభను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఎంపీ ఎన్నికల ప్రచారం బాగంగా నిర్వహించే సభకు అన్ని గ్రామాల బీజేపీ నాయకులు హాజరుకావాలని పేర్కొన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు 16 గ్రామాలలో బీజేపీ మండల అధ్యక్షుడు గునుగుల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బండి సంజయ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ మండల అధ్యక్షుడు బోడ మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ఏ పార్టీ అధికారంలో ఉన్నా నిధులు తెస్తా
- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, మే 7: తాను చేసిన అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. మంగళవారం నగరంలోని భాగ్యనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం డివిజన్ ప్రముఖులు, ముఖ్యనాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. 2018లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి గంగుల కమలాకర్ చేతిలో ఓటమిపాలైన బండి సంజయ్‌కుమార్ 2019లో ఎంపీగా పోటీచేసి సానుభూతి, మత విద్వేషాలను రెచ్చగొట్టి గెలిచారని విమర్శించారు. ఐదేళ్ళు ఎంపీగా ఉండి ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. తాను మంజూరీ చేయించిన జాతీయ రహదారులను అతడే తీసుకువచ్చానని చెప్పుకుంటున్నాడని విమర్శించారు. కనీసం జడ్పీ, మండల, మున్సిపల్ సమావేశాలకు కూడా హాజరుకాలేదన్నారు. అసెంబ్లీకి పోటీ చేసి ఓడి పోయి మళ్లీ ఎంపీగా పోటీ చేస్తున్నాడని తెలిపారు. ప్రజాసమస్యలు పట్టించుకోకుండా, అభివృద్ధికి ఎలాంటి నిధులు తేకుండా సానుభూతి, దేవుడి పేరు చెప్పి గెలువాలనుకుంటున్న సంజయ్‌కి ఓట్లుఅడిగే హక్కు లేదన్నారు. ప్రచారానికి వచ్చే ఆయనను ఈ విషయంపై నిలదీసి అడుగాలని కోరారు. మరోసారి తనను గెలిపిస్తే సింగాపూర్ తరహాలో కరీంనగర్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను తీసుకువచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ట్రిపుల్ ఐటీ కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ ప్రదాత వినోద్‌కుమార్‌ను మళ్లీ ఎంపీగా గెలిపించాలని కోరారు. ఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నా పార్లమెంట్‌లో గళమెత్తి నిధులు తెస్తారన్నారు. ఎంపీగా వినోద్‌కుమార్, ఎమ్మెల్యేగా తాను జోడెద్దుల్లా పని చేసి కరీంనగర్‌లో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ టి భానుప్రసాద్‌రావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు. కార్పొరేటర్లు, వంగపల్లి రాజేందర్‌రావు, దిండిగాల మహేశ్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు హరిశంకర్, అజిత్‌రావు పాల్గొన్నారు.

రుద్రంగి : ప్రజా సమస్యలపై కొట్లాడే బోయినపల్లి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వేములవాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహరావు అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలపై గళమెత్తిన ఏకైక వ్యక్తి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, దయ్యాల పెద్దులు రవి, గణేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: తెలంగాణ హక్కుల కోసం బీఆర్‌ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ పోరాడినారని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని గడప గడపకు తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినోద్‌కుమార్‌ను భారీ మెజర్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గోషిక శ్రీనివాస్, దూస ఈశ్వరి, దూస రాజేశం, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ బస్ యాత్రతో కాంగ్రెస్ గుండెల్లో దడ

గంభీరావుపేట: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్ యాత్రతో కాంగ్రెస్ నాయకుల గుండెల్లో దడ పుట్టిందని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉన్న ప్రతి పక్షంలో ఉన్న ప్రజల మేలు కోరే తపన కేసీఆర్‌ది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల పునాదులపై ఏర్పడిందని, అందుకు నిదర్శనం అమలు కానీ హామీలేనని అన్నారు. బండి సంజయ్ ఎంపీగా ఐదేళ్ల కాలంలో ప్రజలకు చేసింది శూన్యమన్నారు. ఎంపీపీ వంగ కరుణసురేందర్‌రెడ్డి, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, పట్టణ అధ్యక్షుడు పెద్దవేని వెంకటి, నాయకులు తదితరులు ఉన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న వినోద్‌కుమార్

ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్‌ను గెలిపించండి

- ● బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ ఒక్కటే..
- ● మంత్రి పొన్నం ప్రభాకర్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, మే 7: ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మంగళవారం నిర్వహించాల్సిన కరీంనగర్ జనజాతర సభ వర్షం కారణంగా రద్దయింది. అనంతరం అదే సభావేదికపై మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సభ వర్షం కారణంగా రద్దయినా ప్రకృతి తమను ఆశీర్వదించిందన్నారు. సభకంటే ప్రజలకు ఎండవేడి నుంచి ఉపశమనం ముఖ్యమని అన్నారు. ఈ రోజు కురిసిన గాలివానలాగే కాంగ్రెస్‌కు ఓట్ల వాన కురుస్తుందన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని నాలుగు మండలాలు మినహా అన్ని మండలాల్లో కార్నర్ మీటింగ్‌లకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించిందన్నారు. ఉత్తరభారతదేశంలో మొదటి, రెండో దశలో బీజేపీకి వ్యతిరేక ఓటింగ్ వచ్చిన కారణంగానే మోదీ దిగజారుడు వాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లాలో కృంగా ఉందని, బీజేపీ ఎంపీ బండి సంజయ్ వెంట ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎందుకు లేరని మంత్రి ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి స్థానికేతరుడని, అతని గ్రాఫ్ పడిపోయిందన్నారు. అవినీతి కారణంగానే బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్ష పదవి పోయిందని, దీనిపై సమాధానం చెప్పాలన్నారు. రాముడి కల్యాణానికి ముందు అక్షింతలు ఎలా వస్తాయని ప్రశ్నించాడు. అక్షింతలు కాదు అవి రేషన్ బియ్యమని కేటీఆర్ అన్నాడని, తాను ఆ వ్యాఖ్యలు చేయలేదని తెలిపారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ ఒకటేనని, ఢిల్లీలో తోస్తీ, గల్లీలో కుస్తీ చేస్తుంటాయని విమర్శించారు. కరీంనగర్‌ను కోహినూర్ వజ్రంలా అభివృద్ధి చేస్తానంటూ, విజన్‌తో వస్తున్న వెలిచాల రాజేందర్‌రావును ప్రజలు గెలిపించాలని కోరారు.

బీజేపీ వస్తే రాజ్యాంగం రద్దు

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుమాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసే అవకాశముందన్నారు. తన తండ్రి చివరి కోరిక మేరకు తాను ప్రజలమధ్య ఉండాలనుకుని ఎంపీగా పోటీ చేస్తున్నానని చెప్పారు. ఎటువంటి అవినీతి మచ్చలేని తనను ప్రజలు ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్‌ను కోహినూర్‌గా చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరు సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆకారాపు భాస్కర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కర్ర సత్యప్రసన్నరెడ్డి, అనిల్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్, వెంకటాపూర్, పదిర గ్రామాల్లో కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ఆయన కుటుంబ సభ్యులు రోహిణి, ప్రతిభ, శిరీష, రమాదేవీ మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కర పత్రాలు పంచుతూ పార్లమెంటు ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి మహేందర్ రెడ్డి నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లోని ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చిందని అన్నారు. కూలీలకు పని కల్పించాలనే లక్ష్యంతో ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ ప్రవేశ పెట్టిందన్నారు. అక్కపల్లి, గుండారం, తిమ్మాపూర్ గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కుల సంఘాల సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు నర్సయ్య లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, బుచ్చాగౌడ్, రాజునాయక్, రాజేందర్, రాములు, సాహెబ్, దత్తాద్రిగౌడ్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న రాజేందర్‌రావు కుటుంబ సభ్యులు

వడగళ్ల వర్షం.. తడిసిన ధాన్యం

- జిల్లాలో ఉరుములు, మెరుపులతో వాన
- ఎండ వేడికి ఉపశమనం
- 44 నుంచి 23 డిగ్రీలకు పడిపోయిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు



చందుర్తి రామారావుపల్లెలో తడిసిన ధాన్యం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎండలతో జిల్లా ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలతో ఇంట్లో నుంచి బయటకు రావడానికే ఇబ్బందులు పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో వడగళ్ల వర్షం కురిసింది. 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నుంచి 23.7 డిగ్రీలకు పడిపోయింది. వాతావరణం చల్లబడడంతో ఉపశమనం కలిగినా కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడ్డారు. సిరిసిల్లలో 12.5 మిల్లీ మీటర్లు, వేములవాడ 6.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సిరిసిల్లతోపాటు జిల్లాలోని మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. భారీ గాలులకు పలు చోట ఇళ్ల పైకప్పులు దెబ్బతిన్నాయి. వేములవాడ మండలం నాంపల్లిలో రేగుల శేఖర్‌కు చెందిన ఇంటి పైకప్పు పూర్తిగా కొట్టుకుపోయింది. కోనరావుపేట మండలం మరిమడ్లలో తిరుపతి అనే రైతుకు చెందిన పాడిగేదే పిడుగుపాటుకు మృతిచెందింది. వీర్నపల్లిలో భారీ వడగళ్లు పడ్డాయి. భారీ ఈదురుగాలులకు చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి.

భద్రతా వలయంలో వేములవాడ

- ప్రధాని పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు

వేములవాడ, మే 7: ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ పట్టణం పోలీసుల భద్రతావలయంలోకి వెళ్లింది. బుధవారం ఉదయం 8-30 గంటలకు ప్రధాని నరేంద్రమోదీ హెలికాప్టర్ ద్వారా వేములవాడకు చేరుకుంటారు. తొలుత ఆయన రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకుంటారు. అనంతరం పట్టణ శివారులోని బాలానగర్ వద్ద ఏర్పాటు చేసిన బీజేపీ ఎన్నికల ప్రచార బహిరంగ సభలో పాల్గొని ప్రజలనుద్దేశించి మాట్లాడుతారు. ఈ మేరకు ఎస్పీ అఖిల్ మహాజన్ నేతృత్వంలో సుమారు 1200 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా పోలీసు అధికారులు మంగళవారం పలుమార్లు ట్రయల్స్ నిర్వహించారు. హెలిపాడ్ నుంచి ఆల యం వరకు, ఆలయం నుంచి బాలానగర్ బహి రంగ సభ స్థలం వరకు, అక్కడి నుంచి తిరిగి హెలి పాడ్ వరకు ట్రయల్ నిర్వహించారు. ప్రధాని పర్య టన నేపథ్యంలో ఆలయం నుంచి వీఐపీ రోడ్డు, పోలీస్‌స్టేషన్ మార్గం, తెలంగాణ చౌక్, చెక్కపెల్లి రోడ్డులోని పెద్దమ్మ గుడి సర్కిల్, బాలానగర్ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉండ నున్నాయి. ఉదయం నుంచి ప్రధాని పర్యటన పూర్తయ్యే వరకు భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించరు.









అక్రమంగా మొరం తరలింపు

● ఎక్స్‌కావేటర్, రెండు ట్రాక్టర్లు సీజ్

మెట్‌పల్లి, మే, 7: అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. మంగళవారం మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన రేగుంట శివారులోని మైసమ్మ గుట్ట నుంచి అక్రమంగా మొరం తవ్వి తరలిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మైసమ్మ గుట్టను తవ్వడానికి ఉపయోగించిన జేసీబీ, తవ్విన మొరాన్ని తరలించడానికి ఉపయోగించిన రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టిన పూదరి నర్సాగౌడ్‌పై కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేశామన్నారు. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కొండపల్లి మారుతి ఇంట్లో అక్రంగా నిల్వ ఉంచిన ఐదు క్వింటాల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన మారుతీపై కేసు నమోదు చేసి పట్టుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు వివరించారు.



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు

● మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, మే 7: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం కరీంనగర్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ ధాన్యాన్ని తరలించడానికి చర్యలు చేపడతామన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత వడగళ్ల వానతో జరిగిన పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం విడుదల చేశామన్నారు. రైతు భరోసాపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి ఆపారన్నారు. రైతాంగానికి సంబంధించిన సమస్య ఉత్పన్నమైనప్పుడు ప్రభుత్వం స్పందిస్తుందన్నారు. తాను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మాట్లాడానని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు.

వడదెబ్బతో నేత కార్మికుడి మృతి


బేతి కిష్టయ్య (ఫైల్)

సిరిసిల్ల క్రైం, మే 7: సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన నేతకార్మికుడు బేతి కిష్టయ్య (70) వడదెబ్బకు గురై మంగళవారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల తెలిపిన వివరాల ప్రకారం... గణేశ్‌నగర్‌కు చెందిన బేతి కిష్టయ్య సాంచలు నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కిష్టయ్య ఆదివారం వడదెబ్బ తగిలి అస్వస్థత పాలయ్యాడు. కుటుంబ సభ్యులు నేత కార్మికుడిని చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. కిష్టయ్య భార్య రాజవ్వ, కూతురు మమత, కుమారుడు సంపత్ ఉన్నారు.

విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు కంట్రోల్‌రూం

గణేశ్‌నగర్, మే 7: జిల్లాలో విద్యుత్ సరఫరాను పర్యవేక్షించడానికి ఇన్‌ఛార్జి ఏఈ, సబ్ ఇంజనీర్‌లతో ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో రౌండ్ ది క్లాక్ కంట్రోల్ రూమ్ ప్రారంభించినట్లు ఎస్ఈ గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూం ఫోన్ నంబర్ 94408 11444లో సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. ఎవరైనా వినియోగదారుడు విద్యుత్ సరఫరా సమస్యను ఎదుర్కొంటే స్థానిక ఏఈని సంప్రదించాలని సూచించారు. ఏఈ నంబర్ సీసీ బిల్లులోఉంటుందని తెలిపారు. ఆ నంబర్‌కు ఫోన్ చేసి వారి సమస్యలను తెలియజేయాలన్నారు. అయినా సమస్య పరిష్కారం కాకపోతే కంట్రోల్ రూం నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

నగరంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురసి చెట్ల కొమ్మలు, ఫ్లెక్సీ బ్యానర్లు విద్యుత్ వైర్లపై పడడంతో పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. అధికారులు, సిబ్బంది స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని తెలిపారు. డీఈలు, ఏడీలు, ఏఈలు, క్షేత్రస్థాయి సిబ్బంది లైన్లపై పడిన బ్యానర్లను, చెట్ల కొమ్మలను తొలగించారన్నారు. మంగళవారం సాయంత్రం 6:30 గంటల వరకు నాలుగు 11/ కేవీ స్తంభాలు, తనుగుల వద్ద ఐదు స్తంభాలు దెబ్బతిన్నాయని తెలిపారు. వాటిని సరిచేసి త్వరలో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు.

ఈత వనం దగ్ధం

మెట్‌పల్లి రూరల్, మే 7: మండలంలోని బండ లింగాపూర్ శివారులోని ఈతవనం మంగళవారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఈతవనంలోని చెట్లు పూర్తిగా కాలిపోయినట్లు గీత కార్మికులు తెలిపారు. ఉపాధి కోసం పెంచుకున్న ఈతవనంలోని చెట్లు కాలిపోవడంతో తమకు ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మికులు కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మల్యాల, మే 7: మండలంలోని రాంపూర్ శివారులో పేకాట ఆడుతున్న జగిత్యాలకు చెందిన అయిదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 26,930 రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.





పోలీసు తనిఖీల్లో నగదు పట్టివేత


కరీంనగర్‌లో పట్టకున్న నగదును చూపెడుతున్న టూటౌన్ సీఐ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, మే 7: కరీంనగర్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన ఆధారాలు లేని రెండు లక్షల యాభై ఏడు వేల ఎనిమిది వందల డెబ్బై రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అక్రమ డబ్బు, మద్యం సరఫరా అరికట్టేందుకు ఇందిరా చౌక్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో 2,57,870 రూపాయలు పట్టుబిడనట్లు తెలిపారు. కరీంనగర్ కొత్తపల్లి హవేలీకి చెందిన మామిడాల సతీష్ వద్ద సరైన ఆధారాలులేని రెండు లక్షల యాభై ఏడు వేల ఎనిమిది వందల డెబ్బై రూపాయలను పట్టుకుని స్వాధీన పరుచుకున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన డబ్బును అధికారుల వద్దకు తరలించామని తెలిపారు.

హుజూరాబాద్‌లో..

● హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.1.10లక్షల నగదు పట్టుకున్నట్లు టౌన్ సీఐ రమేష్ తెలిపారు. హుజూరాబాద్ మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన బొల్లవేని సమ్మయ్య ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్తుండగా రూ.1.10లక్షలు పట్టుకొని సీజ్ చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రూ.50వేల నగదు కంటే ఎక్కువ తీసుకెళ్లకూడదని, లేని యెడల నగదు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మెట్‌పల్లిలో..

మెట్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరైనా నగదు తరలింపునకు తప్పనిసరిగా ఆధారాలను వెంట ఉంచుకోవాలని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి సూచించారు. మంగళవారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఎస్సై చిరంజీవి సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా ద్విచక్ర వాహనంపై రూ.4లక్షల నగదును తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలను చూపించక పోవడంతో అతని వద్ద ఉన్న నగదును స్వాధీనం చేసుకుని ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌కు అప్పగించినట్లు తెలిపారు. అదే విధంగా పట్టణంలోని బస్ డిపో వద్ద తనిఖీల్లో ఎలాంటి రసీదులు లేకుండా రూ.1,47వేల విలువ గల 490 చీరలను వాహనంలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా వ్యాపారరీత్యా లేదా ఆసపత్రితో పాటు ఏదైనా అత్యవసర పరిస్థితిల్లో రూ.50వేలకు పైగా డబ్బులు తరలిస్తే తప్పనిసరిగా ధ్రువీకరణ పత్రాలు, రశీదులు, ఆధారలతో డబ్బును తరలించాలని సూచించారు. తనిఖీలో పాల్గొన్న వారిలో కానిస్టేబుల్ మహేందర్, సిబ్బంది ఉన్నారు.

11న ఉమ్మడి జిల్లా మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 7: ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను ఈనెల 11న నిర్వహించనున్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సాయంత్రం 4 గంటల నుంచి ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డబ్ల్యూ గణపతి తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు, మంచిర్యాల జిల్లాలో ఈనెలలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల ఫుట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. పోటిల్లో పాల్గొనుటకు ఆసక్తిగల క్రీడాకారణిలు ఆదార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో మైదానంలో జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు అంతటి శంకరయ్యకు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9849114956 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఎస్సారెస్పీ ఉపకాలువలో ట్రాక్టర్ బోల్తా

● ఇద్దరు యువకుల దుర్మరణం



బోల్తా పడ్డ ట్రాక్టర్ కింద చిక్కుకున్న యువకులు



రాజేష్ (ఫైల్)



షేక్ హైమద్(ఫైల్)

మల్లాపూర్, మే 7: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని హాస్సేన్ నగర్ శివారులోని ఎస్సారెస్పీ డీ 29 ఉప కాలువలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ రాజేష్(25), షేక్ హైమద్(18)లు ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపేటకు చెందిన రాజేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తండ్రి గతంలోనే మృతి చెందాడు. దీంతో తల్లిని పోషించాల్సిన బాధ్యత రాజేష్‌పై పడింది. ఇక హాస్సేన్‌నగర్ గ్రామానికి చెందిన షేక్ హైమద్ ఇటీవల పదో తరగతి పాస్ అయ్యాడు. మంగళవారం మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులోని మామిడి తోట నుంచి హాస్సేన్‌నగర్ గ్రామ శివారుకు మొరం తరలించేందుకు రాజేష్ వెళ్లాడు. రాజేష్‌తో పాటు హైమద్ కూడా తోడు వెళ్లాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఎస్సారెస్పీ డీ 29 కాలువలో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరూ ట్రాక్టర్ ఇంజన్ కింద చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామస్థులు గమనించి ఇరు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిలిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. యువకుల మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో రాజేష్ తల్లి రోదిస్తున్న తీరు కంట తడి పెట్టించింది.

మానేరులో ఈతకు వెళ్లి ఒకరి మృతి

తిమ్మాపూర్, మే7: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలో ఈతకు వెళ్లి ప్రమాదవశత్తు ఒకరు మరణించారు. స్థానికులు, ఎల్ఎండి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం కరీంనగర్‌లో జరగాల్సిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ కోసం ఫ్లెక్సీలు కట్టేందుకు హైదారాబాద్ నుంచి సోమవారం పది మంది యువకులు కరీంనగర్ వచ్చారు. ఫ్లెక్సీలు కట్టిన తరువాత మంగళవారం మధ్యాహ్నం అందురు కలిసి దిగువ మానేరు డ్యాంలోకి ఈత కొట్టేందుకు వెళ్లారు. అందులో ఒక వ్యక్తి హైదారాబాద్, బాలనగర్‌లోని స్నేహపురి కాలనీకి చెందిన సింగారం రమేష్(28) ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండి ఎస్సై చేరాలు వివరాలు సేకరించి మృతదేహన్ని కరీంనగర్‌లోని ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

శంకరపట్నం, మే7: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం శంకరపట్నం మండలంలోని అంబాలాపూర్‌కు చెందిన గొల్లెన సమ్మయ్య (53) అప్పులు చేసి ఇల్లు నిర్మించాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపానికి గురై ఈ నెల 6న ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు హుటాహుటిన 108వాహనంలో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరు..

వీణవంక,మే07:మండలంలోని వల్భాపూర్ గ్రామనికి చెందిన పోతరాజు పోచాలు(45) అప్పుల బాధతో పురుగల మందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నాడు.పోలీసుల వివరాల ప్రకారం తనకున్నా వ్యవసాయ భూమిలో మొక్క జోన్నవరి పంట వేయగా సరైన దిగుబడి రాక బంధువుల వద్ద తెచ్చిన అప్పుల ఎలా తీర్చాలని జీవితం పై విరక్తి చెంది ఈ నెల 1వ తేదిన గడ్డి మందు త్రాగాగ చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ అసుపత్రికి తరలించగా చికిత్స పోందుతు మృతి చెందినట్టు తెలిపారు.మృతుని భార్య పోతరాజు సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

పొలాల్లో చెలరేగిన మంటలు

ఎల్లారెడ్డిపేట, మే 7: ఎల్లారెడ్డిపేట శివారులోని వ్యవసాయ పొలాల్లో మంగళవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పొలాల్లో మంటలు చెలరేగాయి. సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట కోసిన గడ్డితో పాటు రైతులకు చెందిన విద్యుత్ స్టార్టర్లు, సాగునీటి పైపులు, విద్యుత్ సర్వీస్ వైర్లు, పశు గ్రాసం కాలిపోయాయి. అప్రమత్తమైన రైతులు మంటలను ఆర్పి వేయడంతో భారీ ప్రమాదం తప్పినట్లయింది. వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పేర్కొంటున్నారు.

జగిత్యాలలో చోరీ

జగిత్యాల టౌన్,మే7: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో మంగళవారం చోరీ జరిగింది. దొంగలు లావణ్య అనే మహిళా ఇంట్లో చొరబడ్డారు. ఇంటి తాళాలు పగుల గొట్టి బీరువాలో ఉన్న తులంన్నర బంగారంతో పాటు రూ. 20 వేల నగదు అపహరించుకవెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

గల్ఫ్ కార్మికులను మోసం చేసిన బీఆర్ఎస్, బీజేపీ

● తెలంగాణ గల్ఫ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి

ధర్మపురి, మే 7: బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు గల్ఫ్ కార్మికులను మోసం చేశాయని తెలంగాణ గల్ఫ్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి ఆరోపించారు. ధర్మపురి పట్టణంలో టీపీసీసీ ఎన్నారై సెల్ ఇంటర్ నేషనల్ కన్వీనర్ మంద భీంరెడ్డితో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గల్ఫ్ బోర్డు, ఎన్నారై పాలసీ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేసి సీఎం రేవంత్‌రెడ్డి నిబద్ధత చాటుకున్నారన్నారు. గ్రామాల్లోని గల్ఫ్ కార్మికుల కుటుంబ సభ్యులు, గల్ఫ్ రిటనీలు వేసే ప్రశ్నలకు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమాధానం చెప్పే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టిందన్నారు. గల్ఫ్ దేశాలలో మృతి చెం దిన వలస కార్మికుల కుటుంబాలకు రూ 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిం పునకు కాంగ్రెస్ పార్టీ వేములవాడలో ప్రారంభించిందన్నారు. హైదరా బాద్‌లో జరిగిన గల్ఫ్ భరోసా ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సీఎం గల్ఫ్ బోర్డు ఏర్పాటు, సమగ్ర ఎన్నారై పాలసీ గురించి స్పష్టమైన ప్రకటన చేసినట్లు ఆయన గుర్తు చేశారు. హైదారాబాద్‌లో సౌదీ అరే బియా, కువైట్ దేశాల కాన్సులేట్లు ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. గల్ఫ్ కార్మికులను దోచుకున్న బీజేపీ ప్రభుత్వానికి కార్మికుల కుటుంబాలు బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. టీపీసీసీ ఎన్నారై సెల్ ఇంటర్ నేషనల్ కన్వీనర్ మంద భీంరెడ్డి మాట్లాడుతూ



సమావేశంలో మాట్లాడుతున్న నరేష్‌రెడ్డి

హైదారాబాద్‌లో ఎమిగ్రేషన్ ఆఫీస్ ఏర్పాటు చేసి గల్ఫ్ కార్మికులను ఆదుకున్న అప్పటి కేంద్ర దివంగత మంత్రి వెంకటస్వామి సేవలను కొనియాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు గల్ఫ్ కార్మికులు అండగా నిలవాలన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ ఎన్నా రై సెల్ ఇంటర్ నేషనల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎనగంటి హరీష్, మాదం వినోద్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రమ్మీకి బానిసై సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

● రూ.12 లక్షల అప్పుతో మనోవేదన



పృథ్వీ(ఫైల్)

గంగాధర,మే 7: ఆన్‌లైన్ రమ్మీకి బానిసగా మారిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రూ.12 లక్షలు అప్పు చేసి తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలానికి చెందిన నాగుల లక్ష్మణ్, లక్ష్మి దంపతులు 30 సంవత్సరాల క్రితం గంగాధర మండల కేంద్రంలోని మధురానగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. వీరికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. లక్ష్మణ్ ఆటో నడుపుకుంటూ కూతురికి పెళ్లి చేయగా కుమారుడు పృథ్వీ(28)ని ఇంజనీరింగ్ చదివించాడు. పృథ్వీ హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సాధించాడు. రెండు నెలల క్రితం ఉద్యోగం నిమిత్తం పృథ్వీ ఉత్తరప్రదేశ్ వెళ్లాడు. ఆన్‌లైన్ రెమ్మీకి అలవాటు పడిన పృథ్వీ స్నేహితుల వద్ద వివిధ కారణాలతో 12లక్షల రూపాయల వరకు అప్పు తీసుకున్నాడు. 15 రోజులుగా ఉద్యోగానికి వెళ్లకుండా రూంలోనే ఉన్నాడు. మొత్తం డబ్బులు పోవడంతో పాటు అప్పు తీర్చే మార్గం లేక మానసికంగా కుంగిపోయి శనివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం రాత్రి మృతదేహం గంగాధరకు రావడంతో మంగళవారం దహన సంస్కారాలు పూర్తి చేశారు. తండ్రి ఆటో నడుపుతూ పిల్లలను ఉన్నతంగా చదివించగా ప్రయోజకుడై చేతికందిన కుమారుడు ఆన్‌లైన్ ఆటలకు బలవడంతో కుటుంబం శోకసంద్రంలో మునిపోయింది.

వైద్యుడిపై సస్పెన్షన్ వేటు

కోరుట్ల, మే 7: కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు శ్రవణ్‌పై వైద్య విద్యాపరిషత్ సస్పెన్షన్ వేటు వేసినట్లు డీఎస్‌హెచ్ఎస్ జిల్లా అధికారిణి సుదక్షతన దేవి మంగళవారం తెలిపారు. గత నాలు రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన సంఘటనపై విచారణ జరిపి ఉన్నత అధికారులకు నివేదిక పంపండంతో వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ ఆదేశాల మేరకు సస్పెండు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. వైద్యుడు శ్రావణ్ విధుల పట్ల నిర్లక్ష్యం కారణంగా అతడిని విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు.

బాలుడి కిడ్నాప్

● తప్పించుకొని ఇంటికి చేరిక

ఇల్లంతకుంట, మే 7: మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి రామ్ చరణ్ (12) అనే బాలుడి కిడ్నాప్ కలకలం సృష్టించింది. బంధువుల వివరాల ప్రకారం.. రామ్‌చరణ్ సోమవారం మధ్యాహ్నం జంగమరెడ్డిపల్లె మార్గంలోని ఫంక్షన్ హాల్ సమీపంలో క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఓ కారులో ఉన్నవారు పాల కేంద్రం ఎక్కడ ఉందని హిందీలో ప్రశ్నించారు. హిందీ వచ్చిన రామ్‌చరణ్ కారులో ఎక్కి చూపించడానికి వెళ్లాడు. పాల కేంద్రం వచ్చినా కారు ఆపకుండా వేగంగా వెళ్లింది. జంగమరెడ్డిపల్లె గ్రామం మీదుగా కొంతదూరంలో కారులో ఉన్నవారు మూత్ర విసర్జనకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన రామ్‌చరణ్ తప్పించుకొని ఇల్లంతకుంటకు చేరుకున్నాడు. సోమవారం రాత్రి ఇంటికి చేరిన బాలుడు తల్లి లత ఏడుస్తూ జరిగింది చెప్పాడు. దీంతో మంగళవారం పోలీసులకు సమాచారం అందించారు. బాలుడు చెప్పిన వివరాలు సేకరించి విచారణ చేస్తున్నామని ఎస్సై రాజుగౌడ్ తెలిపారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, మే 7: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకుని ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.



కొండగట్టులో భక్తులు

● అన్నదానానికి విరాళం

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన దుంపనపల్లి సతీష్ విరాళం అందించారు. ఈ మేరకు రూ.50వేలను అన్నదానం ఇన్‌చార్జి రాజేందర్‌రెడ్డికి అందించాడు.

గాయపడ్డ యువకుడి మృతి

మెట్‌పల్లి, మే7: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన పట్టణంలోని బొల్లవేని రాజేష్(27) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి మంగళవారం తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లవేని రాజేష్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. రాజేష్ స్నేహితుడు కట్ట మల్లేష్ పని ఉందని ఇంటి నుంచి తన వాహనంపై తీసుకెళ్లాడు. సాయంత్రం తిరిగి రాజేష్‌ను ఇంటి వద్ద వదలడానికి కట్ట మల్లేష్ తన ద్విచక్రవాహనం టీఎస్21ఎల్3367పై ఎక్కించుకుని బయలు దేరారు. ఈ క్రమంలో ఆరపేట శివారులోని శివాలయం వద్ద ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం కింద పడింది. దీంతో రాజేష్‌కు తల, కాళ్లు, చేతులకు బలమైన గాయాలు తగలగా మల్లేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ప్రత్యేక వాహనంలో రాజేష్‌ను చికిత్స కోసం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఆసపత్రికి తరలించారు. రాజేష్ చికిత్స పొందుతూ సోమ వారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రధాన మంత్రి మోదీ పర్యటనను అడ్డుకుంటాం

● ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి

సిరిసిల్ల టౌన్, మే 7: వేములవాడ పట్టణంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను అడ్డుకుంటామని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ పది సంవత్సరాల పాలనలో రూ.14,36,570 లక్షల కోట్లు ధనవంతులకు బ్యాంకుల నుంచి రుణాలను మోదీ మాఫీ చేశారని రైతుల రుణాలను మాత్రం ఒక్క రూపాయి మాఫీ చేయలేదని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వ దేశ సంపదను దోచి పెట్టడమే కాకుండా దేశ సహజ వనరులను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ ఉద్యోగాల ఊసే మరిచారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నడిపించడం చేతకాక ప్రైవేటు పరం చేయడం వల్ల వాటిలో అమలైన రిజర్వేషన్లు రద్దు చేయబడ్డాయని అన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను పెంచి పేద ప్రజల నడ్డి విరిచారని ఆరోపించారు. దేవుడు మతం అని చెప్పే ప్రధాని, ఎంపీ బండి సంజయ్ దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి ఒక్క రూపాయి ఎందుకు మంజూరు చేయలేదో ఇక్కడి ప్రజలకు సమాధానం చెప్పాకే వేములవాడ పర్యటనకు రావాలని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి

ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు అవకాశం ఇస్తే దేశ ప్రజల బతుకులు అధోగతిపాలు అవుతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని అన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులిగంటి వేణుగోపాల్, నాయకులు మోదనపల్లి సాయి, చౌడారపు రాజు, దుబాల కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరుతో మోసం



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు



చందుర్తి సింగిల్ విండో ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

రాయికల్, మే 7: ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్ల తూకంలో తరుగు పేరుతో మోసం చేస్తున్నారని కుమ్మరిపెల్లి గ్రామ రైతులు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. తూకంలో ఒక సంచికి 41.100 కిలోల నుంచి 41.200 కిలోల వరకు తూకం వేస్తున్నారని, ధాన్యం మిల్లుకు చేరిన తర్వాత తరుగు పేరిట కిలో నుంచి 2 కిలోల ధాన్యాన్ని తరుగు తీస్తున్నారని పేర్కొన్నారు. అలాగే ధాన్యం తూకానికి సంబంధించిన ఎలాంటి రశీదులు ఇవ్వడం లేదని, ఈ విషయమై సొసైటీ అధికారులను సంప్రదించగా దురుసుగా మాట్లాడారని తెలిపారు. తమకు న్యాయం చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తిరుపతి, అంజయ్య, నవీన్, రెడ్డి, రాజేష్, రాజన్న, పవన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల నిరసన

చందుర్తి : చందుర్తి మార్కెట్ యార్డుకు చెందిన కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువస్తే తూకం వేయడం లేదని చందుర్తి మండల కేంద్రంకు చెందిన రైతులు సింగిల్ విండో ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చి నెల 10 రోజులు దాటినా ఇప్పటివరకు తూకం వేయలేదన్నారు. కొన్ని రోజులు గన్ని సంచుల కొరత, ఆ తర్వాత లారీల కొరతతో కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కొనుగోలు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. వర్షంతో లారీలు ఇటువైపు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. తూకం వేయకపోవడంతో కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకాల వర్షాలకు ధాన్యం నష్టపోయే ప్రమాదం ఉన్నందున వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు లింగాల రాజయ్య, మర్రి రాములు, లింగాల శ్రీనివాస్, పోతరాజు శ్రీనివాస్, లింగాల రాంప్రసాద్, సిరికొండ గంగయ్య, మేడిశెట్టి శంకర్, మార్త రాజు పాల్గొన్నారు.

డే కేర్ సెంటర్‌కు అనాథ వృద్ధుడు

ఎల్లారెడ్డిపేట ,మే 7: నా అనేవారు ఎవరూ లేని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అనాథ వృద్ధుడు పాకాల సుబ్బారావు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వృద్ధుల డే కేర్ సెంటర్‌లో మంగళవారం చేరాడు. కొంత కాలం క్రితం ఉపాధి నిమిత్తం తూర్పుగోదావరి జిల్లా నుంచి సిరిసిల్ల పట్టణానికి ఆయన తన భార్య లక్ష్మీతో కలిసి వలస వచ్చాడు. ఇటీవల అతని భార్య లక్ష్మి అనారోగ్యంతో మరణించింది. భార్య చనిపోవడంతో సుబ్బారావు ఒంటరిగా మిగిలాడు. అతని దీనస్థితిని తెలుసుకున్న సిరిసిల్లకు చెందిన పాస్టర్ యోహాన్ మండల కేంద్రంలోని తోటి పాస్టర్ మధుకు సమాచారం అందించాడు. అనాథ వృద్ధుడు సుబ్బారావు పరిస్థితిని స్థానిక మాజీ ఎంపీటీసీ బాలరాజు దృష్టికి తీసుకెళ్లాడు. దాంతో ఆయన వృద్ధుల డే కేర్ సెంటర్ కోఆర్డినేటర్ మమతకు పరిస్థితిని వివరించాడు. సుబ్బారావును డే కేర్ సెంటర్‌లో చేర్చుకున్నారు.

ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని గుర్తించిన కుటుంబీకులు

కరీంనగర్ క్రైం, మే7: కరీంనగర్ తీగల వంతెనపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని కుటుంబ సభ్యులు గుర్తించారని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడు గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేటకు చెందిన గాజులపల్లి రాజనర్సు(42)గా కుటుంబ సభ్యులు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 5న ఎవరికీ చెప్పకుండా కరీంనగర్‌కు చేరుకుని జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కొడుకు దిలీప్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

అభివృద్ధిపై దృష్టి సారించని బీజేపీ ప్రభుత్వం

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె వెంకటేష్

భగత్‌నగర్, మే 7: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సారించలేదని, మతోన్మాద పార్టీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె వెంకటేష్ అన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయం ముకుందలాల్ మిశ్రాభవన్‌లో పార్లమెంట్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ అభివృద్ధిపై దృష్టిపెట్టకుండా కేవలం మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుతుందన్నారు. 400 సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను మార్చుతామని బీజేపీ మంత్రులే బాహాటంగా ఉపన్యాసాలు ఇస్తున్నారన్నారు. ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతు తెలుపుతూ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి మాట్లాడుతూ వామపక్ష పార్టీలు సీపీఎం, సీపీఐలకు గ్రామ స్థాయిలో కార్యకర్తలు ప్రజాసంఘాలు ఉన్నాయన్నారు. నిస్పక్షపాతం గాపేదల కోసం అనునిత్యం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రకమిటీ సభ్యుడు జె వెంకటేష్

పోరాటాలు చేస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సదస్సులో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వామపక్ష పార్టీలు కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తామనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శిమిల్కూరి వాసుదేవరెడ్డి, మూసం రమేష్, రాములు, శివరాజ్, గీట్లముకుందరెడ్డి, వర్ణవెంకటరెడ్డి, గుడికందుల సత్యం, బీమాసాహెబ్, శ్రీనివాస్, ఎడ్లరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు గంటలు ఆలస్యంగా టీఎస్ ఎప్‌సెట్

● విద్యార్థుల తల్లిదండ్రుల అందోళన

తిమ్మాపూర్, మే7: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ ఎప్‌సెట్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మే 7,8 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల కోసం, మే 9,10,11 తేదీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కొరకు పరీక్షలు ఉన్నాయి. అయితే కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షిఫ్టులలో నిర్వహిస్తున్నారు. ఉదయం, మధ్నాహ్నం సెషన్‌లలో జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలలో ప్రశాంతంగా ముగిశాయి. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో మాత్రం సుమారు 1.50 నిమిషాలు మధ్యాహ్నం సెషన్ పరీక్ష అలస్యంగా ముగిసింది. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరగాల్సిన పరీక్ష సుమారు రాత్రి 7.50కు వరకు కొనసాగింది. 6గంటలకు పరీక్ష ముగిసే సమయానికి విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల కోసం పరీక్ష కేంద్రం వద్దకు చేరుకొనే సరికి అధికారులు ఇంకా గంట సమయం పడుతుందని,



ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పరీక్ష రాసేటప్పుడు విద్యుత్ అంతరాయం ఏర్పడిందని, అందోళన చెందవద్దని తల్లిదండ్రులకు సూచించారు. దీంతో కొందరు విద్యార్థుల తల్లిండ్రులు హైరానా పడి అన్‌లైన్ పరీక్ష 6గంటలకే ముగుస్తుందని, తమ పిల్లలు లోపల పరీక్ష రాస్తున్నారో లేదో అని ఆందోళనకు గురై ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రం ముందు రాజీవ్ రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. దీంతో రోడ్డుకు ఇరుపక్కలా పెద్ద ఎత్తున ట్రాఫిక్ జాం అయింది. విద్యార్థులు పరీక్ష రాసి సుమారు రాత్రి 7.50 అనంతరం బయటకు వచ్చారు. రాస్తారోకో వద్దకు తిమ్మాపూర్ సిఐ స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు తమ సిబ్బందితో చేరుకొని తల్లిదండ్రులతో మాట్లాడి ధర్నాను విరమింపచేశారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



పరీక్ష రాసి బయటికి వెళ్తున్న విద్యార్థులు

విద్యుత్ సరాఫరాలో అంతరాయం

గాలి దుమారంతో సాయంత్రం 4.20 గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. జనరేటర్ కూడా సకాలంలో సహకరించక పోవడంతో సర్వర్‌తో పాటు సిస్టమ్స్ అగిపోయాయి. జనరేటర్ మరమ్మతులు చేసిన అనంతరం 5.30గంటలకు తిరిగి పరీక్ష ప్రారంభం అయి సుమారు 7.50 గంటల వరకు కొనసాగించారు. ఈ విషయమై ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండ్ శ్రీధర్‌రెడ్డిని వివరణ కోరగా వర్షం కారణంగా పరీక్ష కేంద్రం సమీపంలో పిడుగుపడి ఒక్క సారిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. విద్యార్థులకు ఎలాంటి నష్టం జరుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

ప్రధానిపైనే ఆశలు

- నేడు వేములవాడలో మోదీ పర్యటన
- ఆలయ అభివృద్ధి నిధులకు హామీ ఇచ్చే అవకాశం
- 'ప్రసాద్' పథకం కిందకు రాజన్న క్షేత్రం



వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం

వేములవాడ, మే 7: దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వేములవాడ పర్యటన నేపథ్యంలో దక్షిణ కాశీ వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం అభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ బుధవారం వేములవాడలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో ఆయన తొలుత ఉదయం 8-30 గంటలకు రాజరాజేశ్వర క్షేత్రంలో రాజరాజేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం బాలానగర్‌లో బహిరంగ సభలో పాల్గొంటారు. కరీంనగర్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించే వేదికగా ప్రధాని వేములవాడను ఎన్నుకోవడం వ్యూహాత్మకమేననని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, నిధుల కేటాయింపు విషయంలో తీవ్ర వివక్షకు గురైన వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించే విషయంలో ఈ సభలో ప్రధాని మోదీ ప్రకటన చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రసాద్' పథకం వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయాలకు వర్తింపజేసి, ఈ పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేయాలని గతంలో పెద్ద ఎత్తున డిమాండ్లు వినిపించాయి. ప్రసాద్ పథకం అమలు కోసం తాను తీవ్రంగా పోరాడినట్లు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పలుమార్లు చెప్పుకున్నారు. సిట్టింగ్ బీజేపీ ఎంపీ బండి సంజయ్ సైతం ప్రసాద్ పథకం గురించి పలుమార్లు ప్రస్తావించినా పథకం వర్తింపజేసే విషయంలో సఫలీకృతులు కాలేకపోయారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్రమోదీ వేములవాడలో పర్యటించనున్న నేపథ్యంలో వేములవాడ ఆలయ అభివృద్ధిపై కీలక ప్రకటన చేయడంతోపాటు వేములవాడ, కొండగట్టు, ధర్మపురి ఆలయాలను ప్రసాద్ పథకం కిందకు తీసుకొస్తానని ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా హిందుత్వ నినాదంపై ఎన్నికలను ఎదుర్కొంటున్న బీజేపీ ఇప్పటికే కాశీ, ఉజ్జయిని పుణ్యక్షేత్రాలను అనూహ్యరీతిలో అభివృద్ధి చేయడంతోపాటు అయోధ్యలో రామ మందిరాన్ని పూర్తి చేసిన క్రమంలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి విషయంలో ప్రకటన చేయడం ద్వారా ఈ ప్రాంతం లోని హిందువులను పూర్తిగా తమవైపుకు తిప్పుకోవాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

బీజేపీ గెలుపు కోసం సిద్ధంగా ఉన్న ప్రజలు



బీజేపీలో చేరుతున్న రామన్నపేట యువకులు

కోనరావుపేట, మే 7 : ప్రజలు బీజేపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. కోనరావుపేట మండలం రామన్నపేటకు చెందిన 10 మంది బీఆర్ఎస్ నాయకులు బుధవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు భారతీయ జనతా పార్టీని ఆదరిస్తున్నారన్నారు. ప్రధానమంత్రి మోదీ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. ఈ అభివృద్ధి పనులను చూసి బీజేపీలో చేరుతున్నారన్నారు. బీజేపీ నాయకులు బండ మల్లేశం, గోపాడి సురేందర్ రావు, గొట్టె రామచంద్రం, తీగల రవీందర్ గౌడ్, కిష్టస్వామి పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలకు ఆహ్వాన పత్రిక అందజేత

ఎల్లారెడ్డిపేట, మే 7: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం శివారులో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న ఉర్సు ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీకి నిర్వాహకుడు అజీజ్ ఆధ్వర్యంలోని ముస్లిం నాయకులు మంగళవారం కామారెడ్డిలో ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. నాయకులు షాదుల్లా, సాహెబ్, లాల్‌మహ్మద్, ఫజల్ పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 7: పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలందరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్ కోరారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా మహిళా సమాఖ్య భవనంలో మంగళవారం స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంపై మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చందుర్తి, మే 7 : చందుర్తి మండలం కట్టలింగంపేటలో మోత్కుపల్లి మల్లయ్య, చందుర్తి మాజీ సర్పంచ్ మర్రి మల్లేశం, మర్రిగడ్డలో వాసం లస్మవ్వ మృతి చెందగా బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. రుద్రంగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

- కేంద్రాల్లో రైతుల అవస్థలు
- పిడుగుపాటుకు గేదె మృతి
- గాలి దుమారానికి కొట్టుకు పోయిన రేకుల షెడ్లు



ఎల్లారెడ్డిపేటలో ధాన్యం చుట్టూ చేరిన వరద నీరు

సిరిసిల్ల రూరల్/ఎల్లారెడ్డిపేట, మే 7:ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో గ్రామాల్లో మంగళవారం కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. కొనుగోళ్లల్లో నిర్వాహకుల జాప్యంతో ధాన్యం అకాల వర్షానికి తడిసి పోయిందని ఆందోళనకు దిగారు. నిర్వాహకులను నిలదీశారు. తూకం వేసిన ధాన్యం తరలించడంలో నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

● సిరిసిల్ల అర్బన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం సాయంత్రం కురిసిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడడంతో ధాన్యం తడిసిపోయింది. రెండో బైపాస్‌రోడ్డుతోపాటు పెద్దూర్‌లోని మైసమ్మ చెరువు శిఖంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నిల్వ చేసిన ధాన్యం తడిసింది. పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ కిషన్‌యాదవ్, వైస్ చైర్మన్ నారాయణగౌడ్‌తో డైరెక్టర్‌లు పరిశీలించారు.

ఇల్లంతకుంట : మండలంలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం మంగళవారం కురిసింది. రహీంఖాన్‌పేట, వల్లంపట్ల గ్రామాల మధ్య రోడ్డుపై చెట్ల కొమ్మలు విరిగిపడడం, ఇల్లంతకుంటలో విద్యుత్ వైర్లపై చెట్టు కొమ్మ విరగడంతో విద్యుత్ సరఫరాకు కొంత సేపు అంతరాయం ఏర్పడింది.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలోని పలు ప్రాంతాలలో మంగళవారం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. వీర్నపల్లి, బాబాయి చెరువు తండా, భూక్యతండా, రంగంపేటతో పాటు ఆయా గ్రామాలలో, తండాలలో వడగళ్ల వాన కురిసింది. ఈదురుగాలులతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలాయి.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో కల్లాల, కొనుగోలు సెంటర్ల వద్ద ధాన్యం తడిసిపోయింది. మోయినికుంటలో అన్వర్‌కు చెందిన ఇంటి పైకప్పు మొత్తం ఫ్యాన్‌లతో పాటు ఎగిరిపోయి మరో ఇంటి ఎదురుగా పడింది. చెట్లు విరిగి నెలమట్టమయ్యాయి.

వేములవాడలో భారీ వర్షం

వేములవాడ:వేములవాడలో మంగళవారం మధ్యాహ్నం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రాజరాజేశ్వరస్వామి దేవస్థానం పరిసరాలలో భక్తులకు నీడ కోసం వేసిన చలువ పందిళ్లు కూలిపోయాయి. బుధవారం ప్రధాని మోదీ ఎన్నికల ప్రచార సభ కోసం పట్టణ శివారులోని బాలానగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలి వద్ద ఈదురు గాలులు, వర్షంతో టెంట్లు, విద్యుత్ లైట్లు నేలకొరిగాయి. కుర్చీలు చెల్లాచెదురుగా పడిపోయాయి. సభా ప్రాంగణంలో వర్షపు నీరు చేరింది. ఆలయ పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ల చుట్టూ వరద నీరు చేరుకుంది.



బహిరంగ సభా స్థలంలోకి చేరిన వరద నీరు



నెలకొరిగిన విద్యుత్ స్తంభం, చెట్టు, వీర్నపల్లిలో వడగళ్లు

వేములవాడ రూరల్: మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. బొల్లారంలో కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం తడిసింది. చెట్లు, విద్యుత్ స్థంబాలు నేలకొరిగాయి.

బోయినపల్లి: బోయినపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కోతకురాని వరి నెలకొరిగింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులు ఇబ్బందులు పడ్డారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు ఇబ్బంది పడ్డారు. మట్టిమల్ల గ్రామానికి చెందిన దాదె జలపతికి చెందిన పాడి గేదె పొలం వద్ద చెట్టుకు కట్టేసి ఉండగా పిడుగు పడి మృతి చెందింది. మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. మంగళపల్లిలో హనుమాన్ టెంపుల్ ఏరియాలో నీరు నిలిచి నడవాలేని పరిస్థితి ఏర్పడింది.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంతో పాటు కట్టలింగంపేట, మల్యాల తదితర గ్రామాల్లో మంగళవారం అకాల వర్షంతో రైతులు అవస్థలు పడ్డారు. మండలంలోని రామారావుపల్లిలో వడగండ్ల వర్షం కురవడంతో ధాన్యం తడిసింది. కొనుగోలు చేసిన ధాన్యం తరలించేందుకు లారీల కొరతతో తూకం వేయడంలో తీవ్రజాప్యం జరుగుతోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతుబంధు నిధుల విడుదలను ఓర్వని బీజేపీ నేతలు

వేములవాడ, మే 7: రైతుబంధు నిధులను రైతుల ఖాతాలో జమ చేయడాన్ని బీజేపీ నేతలు ఓర్చుకోవడం లేదని వేములవాడ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద చెప్పిన సమయానికి ముందుగానే రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేసిందని, రైతుల ఖాతాలో పడ్డ నిధులను ఆపేలా ఎన్నికల కోడ్‌ను అడ్డుగా పెట్టుకుని బీజేపీ నేతలు కుట్రలు చేసి, రైతుల నోటికాడి బుక్కను లాక్కునేందుకు యత్నించారన్నారు. బీజేపీకి మొదటి నుంచి అన్నదాతలు అంటే అక్కసని, కేంద్రం నల్ల చట్టాలు తెచ్చి రైతులను నట్టేట ముంచే ప్రయత్నం చేసిందని మండిపడ్డారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత గడ్డు పరిస్థితిలో నిధులు లేకున్నా అన్నదాతలను ఆదుకోవడం కోసం బ్యాంకులలో రైతు భరోసా నిధులు జమ చేసిందన్నారు. బీజేపీ తన గుప్పిట్లో ఉన్న ఈసీని అడ్డం పెట్టుకొని బ్యాంక్ ఖాతాలో పడ్డ సొమ్ములను నిలిపి వేసిందన్నారు. ఇంత దారుణం ఎక్కడా ఉండదని, బీజేపీ చేస్తున్న కుట్రలను అన్నదాతలు చూస్తున్నారన్నారు. 2018 ఎన్నికల సమయంలో ఎన్నికల రోజునే కేసీఆర్ రైతు బంధు డబ్బులు వేశారని, అప్పుడు నోరుమెదపని బీజేపీ, ఆపని ఈసీ ఇప్పుడు ఎందుకు ఆపిందని ప్రశ్నించారు. రైతు భరోసా కొత్త పథకం కాదని, గత కొన్ని రోజులుగా క్రమంగా డబ్బులు వేస్తున్నామని, పెండింగ్ డబ్బులు ఇపుడు వేశామని అన్నారు. గత ఎన్నికలలో కాంగ్రెస్ ముందుగానే నిధులు జమ చేయాలని అడిగిందని, ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. రైతు భరోసా నిధులు ఆపిన తోడు దొంగలు బీజేపీ, బీఆర్ఎస్‌ను రైతులు రాష్ట్రం నుంచి తరిమి కొడతారని అన్నారు.

బీజేపీ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ తీస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే7: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్ గ్రామాల్లో బీజేపీ నాయకులు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. వేములవాడలో బుధవారం నరేంద్రమోదీ పర్యటనను విజయవంతం చేయడంతోపాటు కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూద్విచక్రవాహన ప్రదర్శన కొనసాగించారు. పార్టీ మండల ఇన్‌చార్జి రాజిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం నుంచి ప్రారంభమైన నర్మాల, దేశాయిపేట, కోళ్లమద్ది, శ్రీగాద, రాజుపేట, కొత్తపల్లి, లింగన్నపేట వరకు బైక్ ర్యాలీ సాగింది. బీజేపీ పార్లమెంటు అభ్యర్థి బండి సంజయ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని బైక్ ర్యాలీ కొనసాగింది. బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, అధికార ప్రతినిధులు దేవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, నాయకులు రాజిరెడ్డి, రమేష్, విగ్నేష్, సర్వోత్తం, కృష్ణకాంత్ ఉన్నారు.

ముస్తాబాద్ : కరీంనగర్ బీజేపీ పార్లమెంటరీ అభ్యర్థిగా బండి సంజయ్‌ని గెలిపించాలని ముస్తాబాద్ ఆ పార్టీ మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ తీశారు. ఎంఆర్పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. పట్టణ అధ్యక్షులు మెంగని మహేందర్, పెంజర్ల కళ్యాణ్, గిరి, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల ఆర్డర్లతో
నేతన్నల గౌరవాన్ని కాపాడిన కేసీఆర్



మాట్లాడుతున్న ఆగయ్య, చల్మెడ లక్ష్మీనరసింహారావు

సిరిసిల్ల టౌన్, మే 7: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ బతుకమ్మ చీరల ఆర్డర్లతో సిరిసిల్ల నేతన్నల గౌరవాన్ని కాపాడారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మంగళవారం సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కార్మిక క్షేత్రమైన సిరిసిల్లలో ఉపాధి లేక నేతకార్మికులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం, ఆర్థిక ఇబ్బందులతో కొందరు కార్మికులు ఆత్మహత్య చేసుకోవడం వంటివి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కాదా? అని ప్రశ్నించారు. సిరిసిల్ల నేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలి చావులకు చెలించిన కేసీఆర్ తెలంగాణ ఉద్యమం సమయంలో పద్మశాలి సంఘానికి రూ.50 లక్షలు విరాళం ఇచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత నాటి మంత్రి కేటీఆర్ కార్మికుల ఆత్మహత్యలను నివారించడానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారని, ముఖ్యమంతి కేసీఆర్ సహకారంతో సిరిసిల్లకు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి పని కల్పించారని అన్నారు. బతుకమ్మ చీరల ఆర్డర్లతో వలస వెళ్లిన నేత కార్మికులు సిరిసిల్లకు వచ్చి ఉపాధి పొందారన్నారు. ప్రతీ కార్మికుడు దాదాపు రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు ప్రతీ నెల సంపాదిస్తూ జీవనం సాగించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కేటీఆర్ దాదాపు 3వేల కోట్ల ఆర్డర్లను ఇచ్చి ఉరిసిల్లగా మారిన సిరిసిల్లను సిరుల ఖిల్లాగా మార్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను మరిచిందని, నేత కార్మికులకు రావల్సిన రూ.270 కోట్లు బకాయిలను విడదల చేయకుండా కార్మిక కుటుంబాలను రోడ్డున వేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డికి కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే బకాయిలను విడదల చేయించాడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. బతుకమ్మ చీరల తయారీకి ఆర్డర్లను కూడా ఇప్పించాలని డిమాండ్ చేశారు. వేములవాడ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి చలిమెడ లక్ష్మీనర్సింహారావు మాట్లాడారు. జిల్లాను సస్యశ్యామలంగా చేయడం కోసం కేసీఆర్ రాజరాజేశ్వర జలాశాయన్ని నిర్మించారని వేసవి కాలంలో కూడా మానేరులో నీరు కనిపించిందని ఎగువమానేరును నిండుకుండలా నీళ్ల నింపిన ఘనత కేటీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మానేరు ఎడారిని తలపిస్తోందని, పచ్చని పొల్లాలు నీళ్ల లేక బీడువారుతున్నాయని ఆరోపించారు. జిల్లా ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా కేసీఆర్, కేటీఆర్ జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ చైర్మన్ రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రవీన్, పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, నాయకులు మల్లారెడ్డి, న్యాలకొండ రాఘవరెడ్డి, అగ్గిరాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

ఇల్లంతకుంట, మే 7: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల నాయకులు సోమవారం రాత్రి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. కొన్నిపార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారంపై ప్రజలకు వివరించాలన్నారు. ఎంపీలుగా పనిచేసిన వినోద్‌కుమార్, బండి సంజయ్‌కుమార్ ఏనాడూ ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావును భారీ మెజార్టీతో విజయం సాధించబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు ఆనందరెడ్డి, ఉప్పల అమరేందర్, బాలపోచయ్య, ఒగ్గు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని పలు గ్రామాల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఇల్లంతకుంట మాజీ సర్పంచ్ మామిడి సంజీవ్, గూడెపుపల్లి మాజీ సర్పంచ్ గట్ల మల్లారెడ్డి, జవారిపేట మాజీ సర్పంచ్ మంద రాములు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్డి అమరేందర్‌రెడ్డి, నాయకులు ఎర్రోజు అభిలాష్, మామిడి తిరుపతి, చంద్రశేఖర్, సావనపెల్లి రాకేష్, ఉస్మాన్, తిప్పారపు శ్రీనివాస్, సతీష్, సంపత్‌రెడ్డి, భూమయ్య, శంకర్ ఉన్నారు.

గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

ఎల్లారెడ్డిపేట, మే 7: ఎన్నికల ముందు ప్రకటించిన గ్యారెంటీల అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, తిమ్మాపూర్, గుండారం, బాకురుపల్లితండా, గుంటపల్లిచెరువుతండా, బుగ్గ రాజేశ్వరతండా గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గొల్లపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లిన రవీందర్‌రావు కూలీలతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయంలోనే అభివృద్ధి, సంక్షేమం జరిగిందని అన్నారు. ప్రభుత్వ పథకం ప్రతి ఇంటికి చేరిందనే విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీలు అబద్దాలతో మభ్య పెట్టి ఓట్లు దండుకుని ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పి కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఆయా ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి



ఓటు వేయాలని కోరుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

కోనరావుపేట మే 7 : బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని జడ్పీ చైర్ పర్సన్ అరుణ రాఘవరెడ్డి అన్నారు. కోనరావుపేట మండలం రామన్నపేట తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఉపాధి హామీ కూలీలను ఓటు అభ్యర్థించి మంగళవారం ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. రాష్ట్ర మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండ నర్సయ్య, రాఘవరెడ్డి, మంతెన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని వార్డు కౌన్సిలర్లు లింగంపల్లి సత్యనారాయణ, పోచవేణి సత్యఎల్లయ్యయాదవ్, పాతూరి రాజిరెడ్డి, బుర్ర లక్ష్మీశంకరయ్య కోరారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు, సర్దాపూర్, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, చంద్రంపేట గ్రామాల్లో మంగళవారం వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎరవెళ్లి వెంకటరమణారావు, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్, అదిపెల్లి నారాయణగౌడ్, షేక్ అలీ, భూక్య తిరుపతి నాయక్, పెరుమాండ్ల రాములు, కొంపెల్లి రవీందర్, సల్లూరి శ్రీనివాస్, కోల రాజు, కంచర్ల సాయికుమార్, మేకల కార్తీక్, సల్లూరి తిరుపతి, వీరగోని శ్రీనివాస్‌గౌడ్, నర్మెట ప్రభుదాస్, గుగ్గిళ్ల అజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ప్రశ్నించే గొంతుక బోయినపల్లి వినోద్‌కుమార్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు అన్నారు. మండలంలోని అనంతారం, ఇల్లంతకుంట గ్రామాలలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సమస్యలపై అవగాహన లేని వారు ఎన్నికల్లో పోటీపడుతున్నారని, ఓటర్లు గమనించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించడమే కాకుండా ఎంపీగా నియోజకవర్గ అభివృద్ధి కృషిచేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, నాయకులు బొల్లం వెంకటేశం, వోల్లాల రవీందర్, మల్యాల రాజశేఖర్, సాదుల్, సలీం, కూనబోయిన రఘు, దొంతుల శంకర్, కళ్యాణం నర్సయ్య, దుర్గయ్య మహేష్, సమీర్ పాల్గొన్నారు.

వీర్నపల్లి :మారుమూల గ్రామాల ప్రజలు కాంగ్రెస్, బీజేపీ మాయ మాటలను నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి అన్నారు. వీర్నపల్లి మండలం కంచర్లలో పార్టీ నాయకులతో కలిసి పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. మండల యూత్ అధ్యక్షుడు సామల్ల దేవరాజు, సెస్ డైరెక్టర్ మల్లేశం, జడ్పీ కోఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల కేంద్రంలో లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ పడగల మానస రాజు కోరారు. మాజీ సర్పంచ్ అంకారపు అనిత రవీందర్, ప్యాక్స్ వైస్ చైర్మన్ వెంకట రమణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సర్దార్ రోజా, మండల జాగృతి అధ్యక్షుడు కందుకూరి రామాగౌడ్, రమేష్, శివ, బాలకృష్ణ ప్రచారం నిర్వహించారు.



అనంతారంలో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు

కాంగ్రెస్ శ్రేణుల ఇంటింటా ప్రచారం



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, మే 7: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్, సర్దాపూర్, పెద్దబోనాల, చంద్రంపేట గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న పార్లమెంటరీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, వార్డు అధ్యక్షులు మంగ ప్రశాంత్, బైరగోని రమేష్, యూత్ అధ్యక్షుడు నీరటి శ్యాం, గుగ్గిళ్ల తిరుపతిగౌడ్, ర్యాకం అనిల్, భరత్, లింగంపల్లి మధుకర్, పంగ శ్రావణ్‌బాబు, లింగంపల్లి గంగరాజు, సోమ దిలీప్, పల్లె వాసుదేవ్, పంగ వెంకటేస్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌ను గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా అన్నారు. మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఏర్పడి నాలుగు నెలలోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. కచ్చకాయల ఎల్లయ్య, గొట్టె రుక్మిణి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ కూలీలకు కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలను వివరిస్తూ లోకసభ ఎన్నికల్లో రాజేందర్ రావును గెలిపించాలని కోరారు.

చందుర్తి:కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. చందుర్తి మండలం ఎన్గల్, కిష్టంపేట, జోగాపూర్, ఆశిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలపరిచిన అభ్యర్థి రాజేందర్‌రావును గెలిపించాలని ఓటర్లను కోరారు. నాయకులు పొద్దుపొడుపు లింగారెడ్డి, ముస్కు ముకుంద రెడ్డి, లింగంపల్లి సత్తయ్య, లాండే తిరుపతి, బొజ్జ మల్లేశం, అంచ రాంరెడ్డి పాల్గొన్నారు.

బోయినపల్లి: బోయినపల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. మంగళవారం ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును చేతి గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గం కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్‌చ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్, స్తంభంపల్లి ఎంపీటీసీ అక్కెనపల్లి ఉపేందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు చంద్రగిరి వెంకటేష్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి మరియు గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్ : కాంగ్రెస్ బడుగు బలహీన వర్గాల పార్టీ అని కరీంనగర్ పార్లమెంటరీ సహ ఇన్‌చార్జి కనమేని చక్రధర్‌రెడి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు, చీకోడ్, మోర్రాయిపల్లె, చిప్పలపెల్లి, నామాపూర్, కొండాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ పార్లమెంటరీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, మాజీసర్పంచ్ కలకొండ కిషన్‌రావు, మాజీ జడ్పీటీసీ యాదగిరిగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ అంజనేయరావు, భాను, శీల ప్రశాంత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు